# కెన్యా టీ తోటల కార్మికుల దుస్థితి

**భారత్‌లోని** తేయాకు తోటల కంపెనీలు ప్రపంచ మార్కెట్లో తమకు పోటీదారుగా తరచుగా కెన్యాను ఉదహరిస్తూ, కెన్యా టీ ఉత్పత్తులతో పోటీ పడాలంటే తమకు అనేక రాయితీలివ్వాలని, కార్మిక చట్టాలను సరళీ కరించాలని డిమాండ్ చేస్తుంటాయి. ఇండియాలోని టీ పరిశ్రమ ఉత్పత్తులపై 80% అదుపుతో బహుళజాతి కంపెనీ యూనీలివర్ ఆధిపత్యంలో వుంది. ఇదే యూనీలివర్ కెన్యాలోని కెరిఖో జిల్లాలోని టీ తోటలకు యజమాని. 8700 హెక్టార్లలో విస్తరించిన, 5500 మంది పర్మనెంటు కార్మికులతో, అనేకవేల మంది సీజనల్(టెంపరరీ) కార్మికులతో కూడిన అతిపెద్ద టీ ఎస్టేటును అది కలిగి వుంది. కెన్యా టీ చవగ్గా వుండటానికి కారణం స్థానిక కార్మికుల (అంటే టెంపరరీ కార్మికులు)తో పనిచేయించటం, ఆకు కత్తిరింపులో నాణ్యత (యంత్రాలనుపయోగించటం) అనే వాదనలున్నాయి. ఇండియాలోని టీ కంపెనీలు కెన్యాలో వున్న మాదిరి పరిస్థితులే తమకూ వుండాలని డిమాండు చేస్తున్నాయి.

కెన్యాలోని టీ తోటలు బ్రిటిషు కార్పొరేట్ దిగ్గజాల యాజమాన్యంలో వున్నాయి. యూనీలీవర్, ఫిన్‌లేలు బ్రిటిష్ కంపెనీలే. మిగిలిన వలస దేశాలలో మాదిరిగానే కెన్యాలో కూడా టీ తోటలు బ్రిటిషు పాలనాకాలంలోనే ప్రారంభమయ్యాయి. బ్రూక్‌బాండ్, లిప్టన్ వంటి బ్రిటీషు కంపెనీలు 1970లలో కెన్యాలో అడుగు పెట్టాయి. బ్రిటీషు పాలనా కాలంలో టీ తోటల్లో పనిచేయటానికి కెన్యాలో అణచివేతకు గురవుతున్న ఆదివాసీ ప్రజలను తీసుకొచ్చేవారు. అలాగే టాంజానియా, ఉగాండా, రువాండా, బురుండీల నుండి కూడా ఆదివాసీ ప్రజలను తీసుకొచ్చేవారు. వారిపై అత్యంత అమానవీయ అణచివేత కొనసాగేది. ఈరోజు ప్రపంచ టీ ఎగుమతుల్లో 25 శాతంతో కెన్యా అతిపెద్ద ఎగుమతిదారుగా వున్నది.

కెన్యాలో చిన్నరైతులు తమ భూములలో టీ తోటలు సాగు చేస్తారు. వాటి నిర్వహణలోను, టీ ఆకు తుంచటంలోనూ సాంప్రదాయక పద్ధతుల నవలంబించే వీరు పెద్ద కంపెనీలతో ధర విషయంలో పోటీపడలేరు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఎఫ్ఎఒ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం చిన్న రైతులలో సగంమంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నవారే. టీ కార్మికులు, చిన్న రైతులు, చిన్న ఫ్యాక్టరీ యజమానులు మొత్తంగా సుమారు 50 లక్షల జనాభా, మొత్తం కెన్యా జనాభాలో 10 శాతంగా వున్న వీరంతా టీ పరిశ్రమపైనే ఆధారపడి వున్నారు.

అనేక మినహాయింపులతో, వలసపాలనా కాలం నాటి దోపిడీ పద్ధతులు అదేవిధంగా కొనసాగుతూ వున్నాయి. బాల కార్మికులు, ఎటువంటి ఉద్యోగ భద్రతలేని, అతి తక్కువ వేతనానికే పనిచేసే క్యాజువల్ కార్మికులు అక్కడ ప్రధానంగా కనిపిస్తారు. యూనీలివర్‌లో పనిచేసే పర్మనెంటు కార్మికుడు రోజుకు 515 షిల్లింగులు సంపాదిస్తే, అది ఆ కార్మికుని రోజువారీ ఖర్చులకు బొటాబొటిగా సరిపోతుంది. చేత్తో టీ ఆకును తెంపే కార్మికులకు కిలో ఆకుకు 16 షిల్లింగులు ముడతాయి. 515 షిల్లింగులను ఇంటికి తీసుకువెళ్ళాంటే ఆ కార్మికులు కనీసం 32 కిలోల ఆకును తెంపాల్సి వుంటుంది.

టీ ఆకును తెంపే యంత్రం వద్ద పనిచేయటానికి నలుగురు కార్మికులు వుంటారు. ఇద్దరు యంత్రాన్ని నడిపితే, మిగిలిన ఇద్దరు టీ ఆకులను బరువుతూచే కేంద్రాలకు మోస్తారు. సూపర్‌వైజర్ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటేనే వారికి కనీసపు ఆదాయం లభిస్తుంది. యూనీలీవర్ ప్లాంటేషన్లలో క్లర్కులుగా పిలవబడే సూపర్‌వైజర్లు పోలీసులు ధరించే లాంటి డ్రస్సులను ధరించి, బైకులపై తిరుగుతూ కార్మికులను తాము నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలకు చేరుకునేట్లుగా అదిలిస్తుంటారు.

ప్లాంటేషన్లలో కార్మికులు 2 రకాల ఇళ్ళలో వుంటారు. పెళ్ళికాని వాళ్ళు ఒకే గదివున్న ఇంట్లో, పెళ్లైనవాళ్ళు రెండు గదుల ఇంట్లో వుంటారు. చాలా ఇళ్ళకు కలపి ఒకే మరుగుదొడ్డి వుంటుంది. ఒక్క గది ఇళ్ళు చాలావరకు సీజనల్ కార్మికులకు కేటాయిస్తారు. సీజన్ అయిపోగానే వాళ్ళు వాటిని ఖాళీచేసి వెళ్ళిపోవాలి. రెండు గదుల ఇళ్ళల్లో ఒక కుటుంబంగానీ, రెండు కుటుంబాలుగానీ వుంటాయి. ఈ కార్మికుల నివాసాలు ఇండియాలోనూ, శ్రీలంకలోనూ వున్న టీ తోటల కార్మికులకు కేటాయించిన ఘోరమైన ఇళ్ళను జ్ఞప్తికి తెస్తాయి.

టీ కంపెనీలు స్కూళ్ళను, ఆసుపత్రులను నడుపుతాయి. స్కూలు ఫీజులను కార్మికుల వేతనం నుండి మినహాయిస్తారు. చాలామంది కార్మికుల పిల్లలు ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువులు ఆపేస్తారు. బ్రతుకుదెరువుకోసం వారు కూడా పని చేయాల్సిందే.

2016లో 30 శాతానికి పైగా వేతనం పెంచాలని కార్మికులు డిమాండు చేశారు. కానీ లేబర్‌కోర్టు 16 శాతం మాత్రమే మంజూరు చేసింది. 2017లో కార్మికులు మెరుగైన వేతనాల కొరకు సమ్మెకు దిగగా, యూనీలీవర్, ఫిన్లే కంపెనీలు వారితో చర్చలు జరపటానికి నిరాకరించాయి. సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు కాల్పులు జరపగా ఒక కార్మికుడు మరణించాడు. 336 మంది కార్మికులు ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు.

కార్మికులను అణచివేయటానికి టీ తోటల యాజమాన్యం, కెన్యా రాజ్యం కుమ్మక్కు అయినాయని ఈ అనుభవం తెలియజేస్తున్నది. తమ శ్రమను దోచుకుంటున్న ప్రపంచ కార్పొరేట్లపై పోరాడటానికి టీ తోటల కార్మికులు ఐక్యం కావలసిన అవసరాన్ని కూడా ఈ అనుభవం తెలియజేస్తున్నది.

ooo